


ఎప్పుడూ లేంది.

ఆ వీధిలో ఆ ఉదయం నుంచీ చాలా కోలాహలంగా ఉంది. అందమయిన కార్లూ, జీపులూ ఏదో పనిగట్టిన వేటకుక్కల్లా అటూ ఇటూ పరిగెడుతున్నాయి. కొంతమంది కుర్రాళ్ళు ఎలక్ట్రిక్ స్తంభాలకు విశ్రాంతి లేకుండా రంగురంగుల కాగితాల తోరణాలు కట్టి ఆ వీధంతా కన్నుల పండువగా అలంకరిస్తున్నారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటువాళ్ళు, రాత్రయితే కటిక చీకటిగా ఉండే ఆ వీధిని గత కొద్దేళ్ళలా, అజాగ్రత్త చేయక, ఫ్యూజయిన బల్బులన్నీ తీసవతలపారేసి సరికొత్త బల్బులేసి, అన్నీ సరిగ్గా వెలుగుతున్నయ్యో లేదో రెండు మూడుసార్లు పరీక్షకూడా చేశారు. కొన్ని సంవత్సరాలనుంచీ ఆలనా పాలనా చూసేవాడు లేకపోవడం చేత కొన్ని గజాల్లోతున గుంటలు గుంటలుగా పడిపోయిన ఆ రోడ్డుని కొంతమంది కూలీలువచ్చి చదును చేసి నీళ్ళు జల్లుతున్నారు. ఎప్పట్నుంచో శుభ్రం చేయకపోవడంవల్ల రోడ్డుకటూ ఇటూ చిన్నసైజు పర్వతాల్లా పెరిగిపోయిన చెత్తని కొన్ని మునిసిపాలిటీ బళ్ళు ఎత్తి తీసుకుపోతున్నయి. ఏనుగుల్లా బలిసిపోయి ఆ వీధంతా ఆక్రమించుకునిఉన్న పందుల్ని వాటి స్వంతదార్లు వచ్చి "ఈ ఒక్క రోజుకీ ఇంటిపట్టున ఉండండే" అంటూ అన్నిటినీ బళ్ళమీద వేసుకుపోయారు. పిల్లకాలవల్లా తయారయి చాలాచోట్ల రోడ్డుమీదకు పొంగుకొస్తున్న మురిగ్గుంటల్ని మునిసిపాలిటీవాళ్ళు శుభ్రంచేయించి గట్లువేయించి, దోమలు రావడానికి మందు వేయసాగారు. వీధిలో ఇంత కోలా

హలం జరుగుతున్నా ఆ సంగతి అక్కడి ఇళ్ళల్లోని వాళ్ళకెవరికీ తెలీదు. సాధారణంగా వాళ్ళు నిద్రలేచేసరికి ప్రొద్దున్న పదవుతుంది. లేచిన తరువాత వాళ్ళుచేసే మొదటిపని ఓసారి వీధిలోకొచ్చి అందరూ ఒకరినొకరు పలుకరించుకోవడం, అంతకు ముందురోజు రాత్రి ఎవరెంత సంపాదించిందీ తెలుసుకోవడం. కాసేపు ఆ రోజు గడపాల్సిన విధంగురించి నిర్ణయించుకోవడం. అంతే!

కానీ అనుకోకుండా శాంతాదేవి ఆ రోజు చాలా త్వరగా నిద్ర లేచింది. అందుక్కారణం ఆమెకున్న ఒక్కగా నొక్క పాప ఆరాత్రంతా పాపకు జ్వరం. తెల్లారేవరకూ కలువరిస్తూనే ఉంది. తెల్లవారుజామున కొంచెం నిద్రపోయిందిగాని మళ్ళీ ఎనిమిదింటికల్లా లేచి కూర్చుంది. శాంతాదేవి లేచి ఆమెకు కాఫీ కాచి ఇచ్చింది. కాఫీ ఇస్తూ ఆమె చెయ్యి పట్టుకు చూసింది. జ్వరం ఏమ్మాత్రం తగ్గలేదు. చాలా భయం కలిగిందామెకి. డాక్టరు దగ్గరకెళ్దామంటే ఫీజుకి డబ్బు లేదు ఆ డబ్బుకోసమే ఆ రాత్రంతా ఎదురు చూసింది. సరయిన బేరం ఒక్కటి కూడా తగల్లేదు. వచ్చిన ఇద్దరు సన్నాసులే. గీచి గీచి బేరమాడుతున్నారు. వళ్ళుమండి వాళ్ళను కూడా పొమ్మని తిట్టేసింది. ప్రక్కింటి సరస్వతి నయినా అయిదు రూపాయలు అప్పు అడుగుదామనిపించింది శాంతకి. అందుకే చాలా త్వరగా లేచి ముఖమేనా కడుక్కోకుండా ఓ సారి వీధిలోకొచ్చి తొంగి చూసింది సరస్వతింటివేపు. అక్కడ సరస్వతి కనిపించలేదుగాని. మొత్తం రూపు మారిపోతున్న తమ వీధినీ. అక్కడి కోలాహలాన్నీ చూసి ఆశ్చర్యపోయి అలాగే నుంచుండిపోయింది. అక్కడేదో మహత్తరమయిన విషయం జరుగబోతోందని ఊహించింది కాని అదేమిటో తెలీలేదు. మైకులో పాటలు మినహా. మిగతా అన్ని విషయాల్లోనూ పెళ్ళిల్లులా ఉందా వీధి. ఈలపాటలు పాడుకొంటూ రంగు కాగితాలు కడుతూన్న కుర్రాళ్ళదగ్గర కెళ్ళి అడిగిందామె.

"ఏమిటిదంతా ఇవాళ ?" అని

ఆమెను చూడగానే ఆ నలుగురు కుర్రాళ్ళు ఈలపాట ఆపేసి కళ్ళప్పగించి చూడసాగేరు ఆమెవంక. ఆమెజుట్టు చెరిగిపోయి ఉంది. పైట ఉన్నా లేనట్లే ఉంది. మొఖం, ఇంకా నిద్ర మత్తు వదలక అందంగా ఉంది.

"ఇవాళ మంత్రిగారొస్తున్నారు ఇటువేపు!" అన్నాడు ఓ కుర్రాడు.

"ఈ వీధిలోకా ?"

"అవును!" అన్నాడా కుర్రాడు.

"అంత పెద్దమనిషి ఈ వీధిలో కొస్తాడా ?" అంది రుక్మిణి వెనకనుంచి, శాంత వెనక్కుతిరిగి చూసేసరికి రుక్మిణి. సరస్వతి ఇద్దరూ బయటికొచ్చి తన వెనుకే నుంచుని ఉన్నారు.

"మీ కోసమే!" అన్నాడు ఓ కుర్రాడు

"అట్లాగా! ఎదవ మొఖం! సరిగ్గా చెప్పేహ!" అంది సరస్వతి ఈసడింపుగా.

సరస్వతి వత్తి రౌడీరకం. ఆ వీధంతటికీ ఆమెని చూస్తే భయమే. ఆమెని చూట్టంతోనే కుర్రాడు కొద్దిగ జంకాడు.

"మినిష్టరుగారి స్నేహితుడు - రాయ్‌బాబుగారని ఈ వీధిచివర మేడలేదూ-అక్కడ దిగుతారట. అందుకని వీథంతా రిపేరవుతోంది!"

"మరా ఏడుపు ముందే ఏడవకూడదూ! పదండే! పోదాం!" అంది సరస్వతి. శాంత కూడా వాళ్ళతోపాటు సరస్వతి ఇంట్లోకి నడిచింది. అందరూ గదిలోకి నడిచి మంచంమీద కూర్చున్నారు. ఆ గదంతా అసహ్యంగా ఉంది. గోడమీద కొన్ని అసభ్యకంమయిన చిత్రాలూ కాలెండరూ ఉన్నాయి. గోడకు అక్కడక్కడా సున్నంపోయి గుంటలు పడింది.

"రాత్రి నువ్వేమీ సంపాదించ లేదనుకుంటానే" అంది సరస్వతి శాంతవంక చూస్తూ

"ఉహూ" అంది శాంత

"నీకింకా క్రొత్తదనం పోలేదు! ఎట్లాగట్లా రోజుకొక్కడ్నయినా పట్టుకొని వదో పరకో గుంజుకోవాలి! ఇది కాక కొంతమందిని పర్మనెంటుగా మనం ఉంచుకోవాలి. అవసరానికి వాళ్ళు అడ్డుపడుతూంటారు..."

"నీ సంగతి వేరులేవే! నోరేసుకు పడగలవు! మాకా పని చేతకాదు?" అంది రుక్మిణి.

"నీకూ ఏమీ దొరకలేదేమిటి ?" అడిగింది సరస్వతి.

"నాపని అయిపోయిందే! అందమూ, వయసూ రెండూ సడలిపోయినయి. రాత్రి రెండింటివరకూ పడిగాపులు కాస్తే ఒక దేముడు దయతలచి, రెండు రూపాయలిచ్చాడు...అతను కూడా దొరక్కపోతే ఈ వాల్టికి పస్తుండాల్సి వచ్చేది..."

సరస్వతి విరగబడి నవ్వింది. రుక్మిణికి ఆమె నవ్వు. చూస్తుంటే కొద్దిగా ఉక్రోషం వచ్చింది

"నీకేమే! రోజుకి యాభయి రూపాయలు కళ్ళ చూస్తున్నావు మమ్మల్ని చూస్తే పరిహాసంగానే ఉంటుంది.." అంది నవ్వుతూ.

"అవునే వయసుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. నీలాగా ఇప్పుడెంత సంపాయిస్తే అప్పుడు ఖర్చుపెట్టేసి తరువాత ఏడిస్తే ఏం లాభం. నా డబ్బులో రోజూ ఎంతోకొంత బాంకులో వేస్తుంటాను ......ఏమే శాంతా మంచిదా, కాదా ?"

నిజమే నన్నట్లు తలూపింది శాంత.

"నువ్వలా ఆముదం త్రాగిన దానిలా ఉన్నావేమో! మళ్ళీ జరిగిన కథంతా గుర్తుకొస్తోందా ఏమిటి ?

శాంత కథంతా సరస్వతికి తెలుసు. భర్త చనిపోవడం, ఎవ్వరూ ఆదుకోక పోవడం — తిండికోసం నానా అవస్థలూపడి — బిడ్డకోసం అడ్డమయినవాళ నూ దేవురించి, కొంతమందిచే మోసగింపబడి శీలం పోగొట్టుకొని చివరకు ఈ వీధిలోకొచ్చి ఈ వృత్తి స్వీకరించేసింది. ఇది జరిగి ఎంతోకాలం కాలేదు. మహా అయితే మూడేళ్ళు. పైగా నోరులేనిది కావడంవల్ల సరస్వతికి శాంతను చూస్తే జాలీ.అప్యాయతనూ.

"ఊహూ! అదికాదే! పాపకి నిన్నట్నుంచీ జ్వరంగా ఉంది. డాక్టరు దగ్గరకు తీసుకెళ్దామంటే డబ్బులేదు. రాత్రి ఏమయినా దొరుకుతుందేమోననుకొన్నాగాని దురదృష్టం ఎక్కువపాళ్ళల్లో ఉంటంచేత ఒక్క బేరంకూడా కుదర్లేదు. అది మూసినకన్ను తెరవకుండా అలాగే పడివుంది" అంది శాంత విచారంగా.

సరస్వతికి కళ్ళవెంబడి నీళ్ల తిరిగినయి.

"పిచ్చిమొద్దా! నాకీసంగతి నిన్నే ఎందుకు చెప్పలేదూ! పిల్లకంటె నీకు అభిమానం ఎక్కువయి పోయిందన్నమాట. పదిరూపాయలు నన్నడిగి తీసుకొంటే ఏమవుతుంది ? నీ దగ్గర ఉన్నప్పుడే తిరిగి ఇచ్చేదానివి కదా ?"

శాంత ఏమీ మాట్లాడలేదు. కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి. సరస్వతి ఆ సమయంలో ఆమెకు ఓ దేవతలా కనిపించసాగింది.

సరస్వతి మరో గదిలోకి నడిచి పది రూపాయలు తీసుకొచ్చి శాంత కిచ్చింది.

"వెళ్ళు! త్వరగా ఆ పసిదాన్ని డాక్టరు దగ్గరకు తీసుకుపో! అంది శాంత మరొక్క మాట కూడా మాట్లాడకుండా తనింటికి నడిచింది. మొఖం కడిగి త్వర త్వరగా తయారయి ఓ రిక్షా పిలిచి పాపని తీసుకుని డాక్టరు దగ్గరకు బయల్దేరింది. కాగితాలు కడుతూన్న కుర్రాడొహడు ఆమెను చూచి "చెలియా కనరావా ?" అని పాడుతున్నాడు. అతని వంక ఓ సారి ఉరిమి చూసింది శాంత. అందరూ ఘొల్లున నవ్వారు తాము చేసిన ఘనకార్యానికి. మిగతా అన్ని

(29 వ పేజీ చూడండి)

దీర్ఘరోగులకు ఉత్తమ వైద్యము



హస్తప్రయోగం అవయవము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి. శుక్లనష్టము, నపుంసకత్వము, ఉబ్బసము (దమ్ము). బోదకాళ్ళు, కుష్ఠు, బొల్లి, చర్మ వ్యాధులు, కడుపునొప్పి, చెవుడు, పోస్టు ద్వారాకూడా చికిత్స చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల
డాక్టరు పి. కుమారస్వామి దేవర,
ట్రావెలర్స్ బంగళారోడ్, తెనాలి.

## అవినీతికి అంతం

(23 వ పేజీ తరువాయి)

ఇళ్ళల్లోంచి ఆడాళ్ళు బయటి కొచ్చి ఆ వీధిలోని చోద్యం తిలకించసాగారు.

"ఎక్కడి కోయ్ ! ప్రొద్దున్నే బయల్దేరావ్ ? రాత్రి సంపాదించింది చాల్లేదేమిటి ?" అంటూ ఒక్కొక్కరే శాంతా దేవిని పలుకరిస్తున్నారు. వాళ్ళ మాటలు వింటూంటే శాంతకి చిర్రెత్తు కొస్తోంది. అతి కష్టం మీద కోపం దిగ్రమింగు కొని ఊరుకొంది.

డాక్టరు పాపని పరీక్షించి "ఇంకెప్పుడూ ఇలా పిల్లల్ని నిర్లక్ష్యం చేయకు. జ్వరమొచ్చి రెండ్రోజులయితే ఇప్పుడా తీసుకొచ్చేది ?" అంటూ చీవాట్లేశాడు, పాపాయికి ఇంజక్షన్ ఇచ్చి, ఏవో టేబ్‌లెట్లు వ్రాసిచ్చాడు.

"ఈ మాత్రలన్నీ జాగ్రత్తగా వాడు ! మళ్ళీ నాకు ఎల్లుండి వచ్చి పాపని చూపించు" అన్నాడు.

ఇంజక్షన్‌కి, ఫీజూ కలిసి ఎనిమిది రూపాయలు తీసుకొన్నాడు.

ఓ మెడికల్ షాపుముందు రిక్షా ఆపి ఆ టాబ్‌లెట్లు ఎంత ఖరీదు చేస్తాయో అడిగింది శాంత.

"ఆర్రూపాయలు !" అన్నాడు షాపువాడు.

పాపకోసం కొన్ని పళ్ళు కొనుక్కొని ఇంటికి చేరుకుందామె.

తనకాపూట భోజనం లేకుండా పోయింది. వండుకోడానికి ఇంట్లో వస్తువులేమీ లేకుండా పోయినయి.

మళ్ళీ సరస్వతిని డబ్బడగటానికి ముఖం చెల్లలేదామెకి. అలాగే వస్తు ఉందా పూట. ఆ రాత్రికయినా ఓ మహారాజు కనికరిస్తే మర్నాడు పాపకి మాత్రలు కొనగలుగుతుంది. ఏమయినాసరే ఆ రాత్రికి పదిహేను రూపాయలయినా సంపాదించకపోతే పాప తనకి దక్కదు. తనూ ఆకలితో మాడిపోతోంది. సరస్వతిచెప్పిన సూత్రాలు గుర్తుకొచ్చినయి ఆమెకి. తనుకూడా ఎవర్నయినా పర్మనెంట్‌గా ఉంచుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్ళి అతన్ని అడిగి డబ్బు తెచ్చుకోవచ్చు.

ఆ మధ్యాహ్నం మూడింటినుంచీ ముస్తాబవటం మొదలుపెట్టిందామె. తల దువ్వుకొని స్నానం ముగించి చీర మార్చుకొనేసరికి నాలుగయింది. సాధారణంగా ప్రతిరోజూ అయిదింటికిగాని తెమిలి చావదు.

బయట ఏవో బిగ్గరగా కేకలు వినిపించేసరికి ఒక్క ఉదుటున బయటికొచ్చి నుంచుందామె.

సరస్వతి, రుక్మిణి అక్కడనుంచుని పోలీస్ కానిస్టేబుల్ రంగయ్యతో ఘర్షణపడుతున్నారు. మిగతా ఆడాళ్ళందరూకూడా సగం ముస్తాబులో అక్కడికి ఒక్కొక్కరూ చేరుకొంటున్నారు.

"ఇవాళ ఏమయినా మీ ఆటాపాటా కట్టిపెట్టండి!" అన్నాడు రంగయ్య.

"ఏం? ఎందుకు కట్టిపెట్టాలి? మేమేం మామూళ్ళు ఇవ్వటంలేదా?" అడిగింది సరస్వతి

"ఇచ్చారు గనుకే ఊరుకొంటున్నాం! కానీ ఇవాళ ఒఖ్ఖరోజుమాత్రం మీరెవ్వరూ ఇంట్లోంచి బయటకు రాకూడదు. అంతే!" కొంచెం కోపంగానే అన్నాడు రంగయ్య.

"ఎందుకనో?" అంది రుక్మిణి వ్యంగ్యంగా.

"ఇవాళ మినిష్టరుగారు సాయంత్రం ఆరింటికి ఈ వీధి చివరఉన్న రాయ్‌బాబుగారి మేడకు వస్తున్నారు. అక్కడ ఎనిమిదింటికి డిన్నర్ ఉంది. ఈ పూళ్ళో గొప్పగొప్పోళ్ళందరూ డిన్నర్‌కి వస్తున్నారు.

రాయ్‌బాబు గారింటికి దగ్గర దోవ ఇదే! అటు వేపు నుంచీ ఓసందు ఉంది కానీ ఆ సందులో మినిష్టరుగారి కారు పట్టదు. ఆ కారు మొన్నే అమెరికా నుంచి వచ్చింది. మన మామూలు కారుకి రెండింత లుంటుంది. పైగా ఏదో రాయ్‌బాబు గారు కాబట్టి ఇన్నాళ్ళూ ఇటు వేపు రాకుండా ఆ సందులో నుంచి వెడుతూ మిమ్మల్ని ఇబ్బందిపెట్టలేదు. అసలు రాయ్‌బాబుగారు తల్చుకుంటె మీరేనాడో ఇక్కడి నుంచి లేచిపోయేవాళ్ళనుకోండి! అది వేరే సంగతి. అసలు మా సూపర్నెంట్‌గారు, ఇవాళ మిమ్మల్నందర్నీ కటకటాల వెనకాల పడేయమన్నారు గానీ... పోనీలే గదాని..."




పరిశ్రమను ఎలా నెలకొల్పాలో నాకు తెలుసు-కాని-

**చిన్న తరహా పరిశ్రమలకు పెద్ద ఎత్తు ధన సహాయం**

క్రొత్త లఘు పరిశ్రమను స్థాపించుటకు,
ప్రస్తుతం జరుగుచున్న పరిశ్రమను
విస్తరింపచేయుటకు, పెట్టుబడి కావలసినచో
మీ పథకం వివరాలు మాకు నచ్చచెప్పండి.
సాంకేతిక నిపుణులకు ప్రత్యేక
సదుపాయములు మేము చేయగలము.
మీ అవసరాలను మాతో చర్చించండి

**ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్**
సెంట్రల్ ఆఫీసు: సుల్తాన్ బజారు, హైదరాబాద్

కె. గోపాలరావు
ఛైర్మన్

ఎం.వి. సుబ్బారావు
జనరల్ మేనేజరు

ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక బ్రాంచీలుగల బ్యాంకు

IDEAS 13797E A

డాక్టరుగా వుండండి



పోస్టు ద్వారా హోమియో.
పతి నేర్చుకొని M·D·H·
డిప్లొమా పొందండి. ఉచిత
ప్రాస్పెక్టసుకు వ్రాయండి.

Hind Homoeopathic College
TM Regd
W. A. J) Sonepat (Haryana)

"WHEN NATURE FAILS"
పొడుగు పెరగండి
(2 అం. నించి 6 అం. వరకు గ్యారంటీ)
ప్రపంచ ప్రఖ్యాతిపొందిన మా "హైటెక్స్" Hytex ఔషధం ఉపయోగించి మీరు గ్యారంటీగా 2 నుంచి 6అంగుళములవరకు పొడుగుపెరగగలరు. ఏ వయస్సులోవున్నా పరవాలేదు. స్త్రీ.పురుషులు పుచ్చుకోవచ్చు ఒకపియల్ వెల (20 Tabs) రూ. 3-75 పోస్టేజి అదనం.

తెల్ల జుట్టును పోగొట్టి యవ్వనవంతులుగాచేసే ఈ తైలం మరెక్కడా దొరకదు.

మా నిరపాయకరమైన సువాసనగల 'బాల్ కాలా తేల్' (BAL KALA TEL) తెల్ల వెంట్రుకలు శాశ్వతంగా వ్రేళ్ళతోసహా నల్లబడేలా చేస్తుంది. ఒకపియల్ వెలరూ. 3-00p. పోస్టేజిఅదనం 3 ఫియల్స్ వెలరూ. 7-50p. ఉత్తరములుఆంగ్లంలోవ్రాయండి

M/s. UNITED COMMERCIAL CoY.
(Beat No. 29 A.W.V/8)
Flat Door NO. 3883
AMBALA CANTT N. India

"జాలి తలుస్తున్నారు!" అంది సరస్వతి. రంగయ్య కోపంగా ఆమె వంక చూశాడు.

"ఇదిగో సరస్వతీ! మీ మంచికి చెబుతున్నా! మర్యాదగా ఇవాళ ఒక్క రోజుకీ ఇళ్ళల్లో ఉండండి! మీ మర్యాద మీకుంటుంది. అవతల మాకు. చెడ్డపేరు రాకుండా ఉంటుంది. తెలిసిందా! మిమ్మల్నందరినీ మినిష్టర్‌గారు చూస్తే ఇంకేమయినా ఉందా? ఈ వీథిలాంటిదనీ, ఇక్కడ వ్యభిచారం బ్రహ్మాండంగా సాగుతోందని తెలిస్తే ఊరుకుంటారా? మొత్తం మా పోలీసు డిపార్ట్‌మెంట్‌నంతా ట్రాన్స్‌ఫర్ చేయించేస్తారు. ఎక్కడికో తెలుసా? అండమాన్, నికోబార్ దీవులకి. అదీగాక ఇంతమంది పురప్రముఖులు వచ్చేప్పుడు ఇలాంటి దృశ్యాలు వాళ్ళ కళ్ళపడకూడదు. పడితే అది మాకేకాదు. మన ఊరంతటికీ చెడ్డపేరే! తెల్సిందా?"

"అయ్యా—హెడ్డుగారూ! మీ మాట ప్రకారం చేస్తామనుకోండి! ఈ రాత్రికి అందరం ఇళ్ళల్లో దాక్కుంటాం! మినిష్టరుగారికేమీ తెలీనీకుండా ఏమీ ఎరగని సంగనాచుల్లా మా గూళ్ళల్లో దాక్కుంటాం! మరి రేపటికి మా భోజనం మాటేమిటి? మీ మినిష్టరుగారేమయినా భోజనం ఏర్పాట్లు చేస్తారా?" రుక్మిణి అడిగింది.

అప్పటికే అక్కడికి చేరుకున్న ఆడాళ్ళందరూ ఘొల్లున నవ్వేశారు. శాంతికి పై ప్రాణం పైనేపోయింది. ఇవాళ ఏమీ సంపాయించకపోతే తనూ మూలపడటం ఖాయం. పాపకూడా తనకు దక్కదు.

అందరూ రంగయ్యని బతిమాలుతున్నారు.

"పోనీ రాత్రి పదకొండింటి తర్వాత మా బిజినెస్ చేసుకొంటాం! కనీసం అందుకయినా ఒప్పుకోండి. తలో రెండయినా దక్కించుకొంటాం!" అంది శాంత దీనంగా.

"ఇక నేనేం చెప్పను. జైల్లో కొన్నిరోజులు గడపాలనుకొంటే ఇవాళ రాత్రికి ఇంట్లోంచి బయటకురండి! అంతే!" అనేసి అక్కడి నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

వెనుక అందరూ హేళనగా కేకలు వేయసాగారు.

శాంత తన గదిలోకి వచ్చి పాప ప్రక్కన కూర్చుండిపోయింది.

ఆ సాయంత్రానికే ఓ పోలీస్‌వ్యానూ, దాన్నిండా పోలీసులూవచ్చి అక్కడ దిగారు.

ఆడాళ్ళందరూ నిరాశగా కిటికీల్లోంచి బయటకు చూస్తూండిపోయారు. ఎవ్వరి మొఖంలోనూ ప్రాణంలేదు. రేపెట్లా అనేబాధే కనబడుతోంది.

సాయంత్రం ఆరింటికల్లా పెద్దకారు ఒకటి మినిష్టరుగారిని తీసుకొని ఆ వీధిలోనుంచి రాయ్‌బాబుగారింటివేపు దూసుకుపోయింది. దాని వెనుకే కొన్ని జీపులూ, కార్లూ వెళ్ళినయి. రాత్రి ఎనిమిదింటి వరకూ రాయ్‌బాబుగారి బంగళా కలకలలాడిపోయింది. నాలుగయిదు వందలమందికి డిన్నర్ జరిగింది. డిన్నర్‌లో మినిష్టర్‌గారు అవినీతి గురించి, తన పోర్ట్‌ఫోలియో అయిన స్త్రీ జన సంక్షేమాన్ని గురించి చక్కని ఉపన్యాసం ఇచ్చారు. మనదేశంలో ఆడాళ్ళెంత వెనుకబడి ఉన్నారో, వాళ్ళనెలా పైకి తీసుకు రావాలో వివరించారు.

ఆడదాన్ని ఓ ఆటవస్తువుగా కాక ఓ పౌరురాలిగా, నవభారత నిర్మాణంలో ఓ ముఖ్యమయిన పాత్రగా భావించినప్పుడే అది సాధ్య మన్నారు, హాలంతా చప్పట్లు మార్మోగి పోయినయి.

డిన్నర్ అయింతర్వాత రాత్రి పదింటికి మినిష్టర్‌గారు,రాయ్‌బాబుగారు కార్లో ఆ ఊళ్ళోని పెద్ద హోటల్‌కి వెళ్ళారు. అక్కడ రకరకాల మద్యాలు సేవించారు. కాబరెట్‌డాన్స్ తిలకించసాగారు. రీటా అనే అమ్మాయి వచ్చి నృత్యం చేయసాగింది. ఆమె వంటిమీద బట్టలన్నీ ఒక్కొక్కటే దూరమయి పోతున్నాయి. చివరకు మొలమీదా, గుండెలమీదా చిన్న గుడ్డపీలికలు తప్పితే మరేమీ లేకుండా పోయినయి.

"వెరీ గుడ్! మార్వలెస్!" అన్నారు మినిష్టరుగారు.

"రియల్లీ! ఇంతకు ముందెప్పుడూ ఈ అమ్మాయి ఇక్కడ ప్రదర్శన ఇయ్యలేదు. కలకత్తానుంచి మన కోసం తెప్పించాను!" అన్నారు రాయ్‌బాబుగారు. నగ్న నృత్యాలు పూర్తయేసరికి రాత్రి ఒంటిగంటయింది.

ఆ రాత్రి ఆ అమ్మాయీ, మినిష్టరుగారూ ఆ హోటల్లోనే ఓ గదిలో ఉండిపోయారు.

రాయ్‌బాబుగారు మరో చైనీస్ పిల్లతో మరో గదిలో గడిపారు.

మినిష్టర్‌గారెప్పుడు తిరిగొస్తారోనని పోలీసులు తెల్లాగ్లూ ఆ వీధిలోనే ఉన్నారు. అర్ధరాత్రి రెండింటికి పెద్దగా కేకలు వినబడితే సరస్వతి బయటికొచ్చి చూసింది.

శాంత పోలీసుల చేతుల్లో గుంజుకుంటోంది. పోలీసులు ఆమెను బలవంతంగా వాన్ ఎక్కించి స్టేషన్‌వేపు తీసుకపోయారు అవినీతికరంగా ప్రవర్తించిన నేరానికి. ●

ముఖ్య ప్రకటన

గోల్డెన్ కాబినెట్‌లో బిగించబడి కలర్ లైట్‌లో వున్న ప్రసిద్ధి చెందిన కొత్త 1971 మోడల్ లెదర్‌ప్రూఫ్, విల్‌ఫోర్డ్ 4 బాండ్ ట్రాన్సిస్టర్లు. యిప్పుడు నెలకు రు. 10/-లు వాయిదాలపై కొనండి 5 సంవత్సరములు గ్యారంటీ. ధర రు. 260/-లకు తగ్గించబడినది. కొనుగోలు చేయువారు పూర్తి పేరు, సరియైన చిరునామా ఇంగ్లీషులో వ్రాయవలయును. వస్తువులు పార్సెలు ద్వారా పంపబడును.



Wireless Corporation (A. J)
Gandhi Nagar, Delhi 31.